# సాక్షి
## నిజామాబాద్

మంగళవారం, 15, ఆగస్టు, 2023






### అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచవద్దని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు.

- IIలో ▸



### బల్దియాలో షార్ట్‌సర్క్యూట్

మున్సిపల్ కార్పొరేషన్‌లోని స్టోర్‌రూంలో సోమవారం షార్ట్‌సర్క్యూట్‌తో ఫైళ్లు దగ్ధం అయ్యాయి.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
31.7 /24.5

### వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం మోస్తరు వర్షం కురియవచ్చు.

## న్యూస్‌రీల్

### నుడా చైర్మన్‌గా ఈగ సంజీవ్‌రెడ్డి



నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఈగ సంజీవ్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సోమవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా నియామకపత్రం అందజేశారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమకారులకు పదవుల్లో పెద్దపీట వేస్తూ సముచిత గౌరవం కల్పిస్తున్నారని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.

### టౌన్‌ప్లానింగ్ అధికారులకు లోకాయుక్త నోటీసులు

నిజామాబాద్‌నాగారం: మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలు, ఇతర భవనాల నిర్మాణాల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నగరానికి చెందిన బట్టు రాంకుమార్ లోకాయుక్త అధికారులను ఆశ్రయించారు. దీంతో నగర బల్దియా పరిధిలో టౌన్‌ప్లానింగ్ అధికారులకు, కమిషనర్‌కు, కలెక్టర్‌కు, డీసీపీ, సీపీవో కరుణాకర్, టీపీఎస్ ప్రవీణ్, వెంకటేశ్, అనుపమకు లోకాయుక్త నోటీసులు వచ్చాయి. వారం రోజుల కిందటే నోటీసులు వచ్చినా అధికారులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు.

# పంద్రాగస్టుకు ముస్తాబు

- స్వాతంత్య్ర దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు
- అధికారులతో సమీక్షించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి వేముల



స్టాళ్ల కోసం ఏర్పాటు చేసిన టెంట్లు



పరేడ్ మైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

సుభాష్‌నగర్: పంద్రాగస్టు ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందుకు నగరంలోని పోలీస్‌పరేడ్ మైదానం ముస్తాబైంది. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులతో ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. స్వాతంత్య్ర దినోత్సవాలకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు మంత్రి అందజేయనున్నారు. వేడుకల్లో మంత్రి గౌరవ వందనం స్వీకరణ, ప్రసంగం, అధికార, అనధికారుల పరిచయం ఉంటుంది. స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తారు. శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రశంసాపత్రాలు, బహుమతి ప్రదానం, స్టాల్స్ ప్రదర్శన ఉంటుంది. ప్రభుత్వ గురుకులాలతోపాటు కేజీబీవీలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నారు. బాలభవన్ అధికారులు ప్రదర్శనల నిర్వహణపై ఏర్పాట్లు చేస్తారు.

**ప్రభుత్వ పథకాలపై..**

ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి తెలియజేసేలా పలు శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయం, ఉద్యాన, జిల్లా గ్రామీణాభివృద్ధి, అటవీ, పశుసంవర్ధక, మహిళా శిశు సంక్షేమ, నగర పాలక సంస్థతోపాటు ఇతర శాఖల ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ స్టాళ్లలో చిత్రాలు, ఫ్లెక్సీలను ప్రజలు వీక్షించే విధంగా ఏర్పాటు చేస్తారు. అభివృద్ధిని ఆయాశాఖల అధికారులు, సిబ్బంది వివరిస్తారు.



కొత్త కలెక్టరేట్‌లో జెండావిష్కరణకు ఏర్పాట్లు

**కలెక్టరేట్‌లో జెండావిష్కరణ..**

నగరశివారులోని నూతన కలెక్టరేట్ ఆవరణలో ఉదయం 9.45 గంటలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అంతకుముందు 9.30 గంటలకు ఆఫీసర్స్ క్లబ్‌లో ఆవిష్కరిస్తారు. అనంతరం ఉదయం 11 గంటలకు పరేడ్ గ్రౌండ్‌లో వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి మువ్వన్నెల జెండాను ఎగురవేయనున్నారు.



ఎల్లారెడ్డిలో ఆర్టీసీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

# గులాబీ శ్రేణుల్లో జోష్!

- ఉత్సాహం నింపిన కేటీఆర్ పర్యటన
- ప్రత్యర్థి పార్టీలపై విరుచుకుపడ్డ మంత్రి
- ఎమ్మెల్యే సురేందర్‌ను 70 వేల మెజారిటీతో గెలిపించాలని పిలుపు
- కామారెడ్డి, ఎల్లారెడ్డిల అభివృద్ధికి రూ.90 కోట్లు మంజూరు

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ కామారెడ్డి జిల్లా పర్యటన గులాబీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఆయన తన మాటలతో ప్రత్యర్థి పార్టీలపై విరుచుకుపడ్డారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యేపై పొగడ్తల వర్షం కురిపించారు. వచ్చే ఎన్నికల్లోనూ తమ పార్టీ అభ్యర్థిగా సురేందరే బరిలో ఉంటారన్న విషయాన్ని స్పష్టం చేశారు.

– సాక్షి, కామారెడ్డి

ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో సోమవారం కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలలో మంత్రి కేటీఆర్ పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఎల్లారెడ్డి పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో సురేందర్‌ను 35 వేల మెజారిటీ తో గెలిపించిన ప్రజలు.. ఈసారి అంతకు రెట్టింపు మెజారిటీ ఇవ్వాలని కేటీఆర్ కోరారు.

**షబ్బీర్‌అలీ పాచిపోయిన ముఖం**

కాంగ్రెస్ నాయకుడు షబ్బీర్ అలీ, ఆ పార్టీ నాయకులు పాచిపోయిన ముఖాలని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నపుడు అభివృద్ధిని పట్టించుకోని ఆ నాయకులు ఇప్పుడు గడపగడపకు కాంగ్రెస్ పేరుతో తిరుగుతున్నారని విమర్శించారు. ఎల్లారెడ్డి కాంగ్రెస్‌లో ఇప్పటికే ఇద్దరు నేతలు తన్నుకుంటున్నారని, ముచ్చటగా మూడో కృష్ణుడు కూడా వస్తుండట అంటూ మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిని ఉద్దేశించి మంత్రి కేటీఆర్ పరోక్షంగా అన్నారు. బీజేపీ అభ్యర్థికి డిపాజిట్ దక్కకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాల్గొన్నారు.

**భారీగా నిధులు..**

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీటీ రోడ్లు, వంతెనల కోసం రూ.20.31 కోట్లు, మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు మరో రూ.25 కోట్లు మంజూరు చేసిన పత్రాలను మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి ఎమ్మెల్యే సురేందర్‌కు అందించారు. కామారెడ్డి పట్టణంలో అంతర్గత రోడ్లకు రూ.25 కోట్లు, స్టేడియం అభివృద్ధి, స్పోర్ట్స్ కాంప్లెక్సులకు రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నట్టు మంత్రి కేటీఆర్ ప్రకటించారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

**'గంప' నేతృత్వంలో అభివృద్ధి**

కామారెడ్డిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నేతృత్వంలో చురుకుగా అభివృద్ధి జరుగుతోందని ప్రశంసించారు. కామారెడ్డికి మెడికల్ కాలేజీ వచ్చిందన్నారు. ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే సురేందర్‌ను రెట్టింపు మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చిన కేటీఆర్.. గోవర్ధన్ విషయంలో ఎలాంటి ప్రకటన చేయకపోవడం ఆయన అనుచరులను కొంత నిరాశకు గురిచేసింది.

### పోలీసుల ఓవరాక్షన్

మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో పోలీసుల ఓవరాక్షన్ సామాన్యులను ఇబ్బందికి గురిచేసింది. మంత్రి కాన్వాయ్ రాకముందే చాలాచోట్ల రోడ్లను బ్లాక్ చేయడంతో వాహనదారుల ఇబ్బందులు పడ్డారు. ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద మీడియాతో, ఇతర వర్గాలతో కొందరు పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. అయితే ప్రతిపక్ష పార్టీల నేతలను ముందస్తుగా అరెస్టు చేసినా, కామారెడ్డి మున్సిపల్ శివారులో, లింగంపేట మండల కేంద్ర శివారులో కాంగ్రెస్ శ్రేణులు కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేయడం విస్మయానికి గురిచేసింది.





# సిర్నాపల్లి కోవా @ 70 ఏళ్లు

మూడు లీటర్ల పాలను మరిగిస్తే కిలో కోవా తయారవుతుంది. ఇందుకు గంటపాటు శ్రమ పడాలి. రోజు మూడు కిలోల

**కోవా తయారీ..**

కోవా తయారు చేసినా నాలుగైదు వందల గిట్టుబాటు అవుతుందని తయారీ దారులు పేర్కొంటున్నారు. వ్యాపారి వీరి వద్ద నుంచి కొనుగోలు చేసి తీసుకెళ్తాడు. అయితే ఎంతో శ్రమతో కూడుకున్న పని అయినందున ప్రస్తుతం తరం కోవా తయారు చేయడానికి ఇష్టపడటం లేదు. పాల కేంద్రంలో లీటరు పాలు రూ.50 చొప్పున విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ దశలో సిర్నాపల్లిలో ప్రస్తుతం 15 కుటుంబాల వరకే కోవాను తయారు చేస్తున్నారు.

● కుటీర పరిశ్రమగా కోవా తయారీ ● ఇంటింటా వెలసిన బట్టీలు ● ఉపాధి పొందుతున్న గ్రామస్తులు



డెస్క్: సిర్నాపల్లి అంటే సంస్థానాదీశురాలు శీలం జానకీబాయి చరిత్రే గుర్తుకు వస్తుంది. అయితే ఈ గ్రామానికి ఇంకో ప్రత్యేకత ఉంది. ఇక్కడ 70 ఏళ్లకు పైగా కోవా తయారీ కుటీర పరిశ్రమగా వెలుగొందుతోంది. ఇక్కడ తయారైన కోవాను వ్యాపారులు నిజామాబాద్‌లోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఏళ్లుగా అమ్ముతున్నారు. సిర్నాపల్లి కోవా నాణ్యతకూ పెట్టింది పేరు.. ధర కూడా స్వీట్ షాప్‌లలో అమ్మే కోవా కంటే తక్కువే ఉంటుంది. ఒకప్పుడు సిర్నాపల్లిలో రెండు క్వింటాళ్ల వరకు కోవా ఉత్పత్తి అయ్యేది. రానురానూ కోవాను తయారు చేసే వారు తక్కువై పోయారు. బట్టీల్లో వినియోగించే ఎండుకర్రల సేకరణకు అటవీ అధికారులు అనుమతించకపోవడం, బర్ల కొనుగోలుకు, షెడ్ల ఏర్పాటుకు రుణాలు లభించకపోవడం కారణమంటున్నారు.

### ఆరేడు వందల బర్లు, వంద ఆవులు ఉండేవి..



నేను చిన్నగున్నప్పటి నుంచి ఊర్లో కోవా తయారు చేయడం చూస్తున్నాను. నా కిప్పుడు 70 ఏళ్లు.. అప్పుడు ఊర్లో ఆరేడు వందల బర్లు ఉండే.. వంద వరకు ఆవులు ఉండే.. ప్రతి ఇంట్లో పుష్కలంగా పాడి.. పాలు, పెరుగు ఇంటి అవసరాలకు సరిపోనూ ఇంక మిగిలిపోతుండే.. ఇలా మిగిలిన పాలతో ఊర్లో మొదట ముస్లీమాయన కోవా తయారు చేయడం మొదలు పెట్టాడు. కోవాను నిజామాబాద్ తీసుకెళ్లి వీధుల్లో తిరుగుతూ అమ్మేవాడు. ఆ తర్వాత ఒక్కరొక్కరుగా కోవా తయారు చేయడం ప్రారంభించారు. ఇలా సుమారు 60 కుటుంబాలకు పైగానే కోవాను వండుతూ అదనపు ఆదాయం పొందేవారు. ఇలా చాలా ఇళ్లల్లో కోవా బట్టీలు వెలిశాయి. ప్రతి ఇంటి నుంచి నాలుగైదు కిలోలకు తక్కువ కాకుండా కోవాను తయారు చేసేవారు. ఇలా ఊరి నుంచి రెండు వందల కిలోల వరకు కోవా తయారయ్యేది.

– గంగారాం, సిర్నాపల్లి గ్రామ వాసి

### నాణ్యతకు పేరు



సిర్నాపల్లి నుంచి తీసుకొచ్చిన కోవాను నిజామాబాద్ రైల్వే స్టేషన్ వద్ద ఏళ్లుగా అమ్ముతున్నాను. కోవా నాణ్యతగా ఉండటంతో చాలామంది ప్రత్యేకంగా వచ్చి కొనుగోలు చేస్తారు. గతంలో క్వింటాలున్నర వరకు కోవా అమ్ముతుంటిని. ఇప్పుడు 30 కిలోల వరకు అమ్ముతున్నా..సిర్నాపల్లి గ్రామంలో కోవా తయారు చేసే వారు తక్కువై పోయారు.

– సలీం, కోవా అమ్మకందారు

### ఇబ్బందులతో కూడుకున్న పని



పాల కోవా తయారు చేయడం ఇబ్బందులతో కూడుకున్న పని అవుతోంది.. కోవా తయారు చేసేందుకు ప్రత్యేకంగా బట్టీలు ఏర్పా టు చేసి కోవా వండాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమయ్యే ఎండు కట్టెలను సమీప అడవి నుంచి తెచ్చుకునేటోళ్లము.. ఇప్పుడు ఫారెస్టు వాళ్ల అనుమతివ్వడం లేదు. ప్రభుత్వం కోవా తయారీ దారులను ప్రోత్సహించాలి. బర్ల కొనుగోలుకు, రేకుల షెడ్డు నిర్మించేందుకు రుణ సౌకర్యం కల్పించాలి. అయితే సిర్నాపల్లిలో కోవా తయారీకి మళ్లీ పూర్వవైభవం వస్తుంది. ఏ ఉపాధి లేని వారు బాగుపడతారు.

– నాగరాజు, కోవా తయారీదారు

### మా కుటుంబానికి ఇదే ఆధారం



రోజుకు రెండుమూడు కిలోల కోవా తయారు చేస్తాం. నేను చిన్నగున్నప్పటి నుంచి తయారు చేస్తున్నాం. దీని మీదనే బతికినం. ఇంతకు ముందు ఐదారు కిలోలు కోవా తయారు చేసెటోళ్లం, మాకు 15 బర్లు ఉండే..మా బాపు కరోనాతో చనిపోయిండు. ఇప్పుడు మూడు బర్లే ఉన్నయి.పాలు అమ్ము కునే బదులు కష్టపడితే కోవా తయారు చేస్తే నాలుగు రూపాలు ఎక్కువస్తయి.. గ్రామంలో రెండు పాలకేంద్రాలు ఏర్పాటు కావడంతో చాలామంది కేంద్రాలకే పాలు పోసేస్తున్నరు. పాల కేంద్రాలు లేనప్పుడు అందరూ వండుతుండేవారు.

– అకుల సాయిలు, కోవా తయారీదారు

### డిచ్‌పల్లికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు

డిచ్‌పల్లి (నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు, తల్లిదండ్రులు గత కొద్ది సంవత్సరాలుగా చేస్తున్న డిమాండ్ ఎట్టకేలకు నెరవేరింది. డిచ్‌పల్లి మండలానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు అయ్యింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఈ నెల 9న జీవో నెంబరు 60 విడుదల చేసింది. డిచ్‌పల్లి మండలానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గతంలో విద్యార్థులకు ఇచ్చిన హామీని నెరవేర్చినట్లయ్యింది. డిగ్రీ కళాశాల ఏర్పాటుతో డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, ఇందల్వాయి, మోపాల్, నిజామాబాద్ రూరల్ మండలాల విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయనున్నారు. ఇది వరకు రెండుసార్లు డిగ్రీ కళాశాల ఏర్పాటు విషయమై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం సభ్యులు జూనియర్ కళాశాలను సందర్శించి నివేదికలు అందజేశారు.


### వైన్స్‌లకు 320 దరఖాస్తులు



ఖలీల్‌వాడి: జిల్లాలోని 102 వైన్ షాపులకు 320 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెం డెంట్ మల్లారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో వైన్స్‌లకు 545 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. నిజామాబాద్‌లో 137, బోధన్-34, ఆర్మూర్-66, భీమ్‌గల్-47, మోర్తాడ్-36 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. 16,17,18 తేదీల్లో దరఖాస్తులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని ఎక్సైజ్ వర్గాలు తెలిపాయి.

# కమల దళంలో ఇమడలేను..

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షునికి పొద్దుటూరి వినయ్‌రెడ్డి రాజీనామా లేఖ



ఆర్మూర్: బీజేపీలోని అంతర్గత గ్రూపు రాజకీయాలతో విసిగిపోయాను.. ఇక పార్టీలో ఇమడలేకపోతున్నాను.. అందువల్ల పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానంటూ బీజేపీ ఆర్మూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి సోమవారం లేఖ రాసారు. తన రాజీనామాకు గల కారణాలను లేఖలో వివరించారు. ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామానికి చెందిన తాను స్థానికులనే ఎమ్మెల్యేగా గెలిపించాలనే నినాదంతో క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చి 2018 ఎన్నికల్లో బీజేపీ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి 19,599 ఓట్లు సాధించానన్నారు. తదనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ఆర్మూర్ నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీ ఇచ్చి ఆయన విజయంలో భాగస్వాముడిని అయ్యానన్నారు. కానీ ఎంపీ అరవింద్ తనను పార్టీకి దూరం చేయడానికి కుట్రలు చేస్తూ కించపరుస్తున్నారని లేఖలో ఆవేదన వ్యక్తం చేసారు. మనస్తాపంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరికపై ప్రచారం..!**

బీజేపీకి రాజీనామా చేసిన వినయ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ముఖ్య నేతలతో మంతనాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డికి ఒకప్పుడు వ్యాపార భాగస్వామి అయిన వినయ్‌రెడ్డి 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తన మిత్రుడు జీవన్‌రెడ్డి విజయానికి కృషి చేసాడు. అనంతరం వారిద్దరి మధ్య తలెత్తిన విభేదాల కారణంగా అప్పుడు టీఆర్‌ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరి 2018 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచి మూడో స్థానంలో నిలిచాడు. ఇప్పుడు బీజేపీ పార్టీకి సైతం రాజీనామా చేసి ఖాళీగా ఉన్న కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుసోంది.

## విద్యార్థులకు క్విజ్‌ పోటీలు



నిజామాబాద్‌ నాగారం: యూత్‌ఫెస్ట్‌లో భాగంగా జిల్లా ఎయిడ్స్‌ నివారణ–నియంత్రణ సంస్థ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో సోమవారం నెహ్రూ యువ కేంద్ర ఆఫీస్‌లో జిల్లాలోని 13 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9, 10వ తరగతి విద్యార్థులకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌, టీబీ, రక్తదానం మీద జిల్లా స్థాయి క్విజ్‌ పోటీలు నిర్వహించారు. ఇందులో మొదటి బహుమతి రూ.1000 క్యాష్‌ను తొండకూర్‌కు చెందిన అభినయ్‌, ప్రణీత్‌లు, ద్వితీయ స్థానంలో ఆర్మూర్‌కు చెందిన వేదశ్రీ, అఫియా ఫిర్దోజ్‌కు రూ. 750 నగదు, తృతీయ స్థానంలో మాక్లూర్‌కు చెందిన ఆకాంక్ష, హర్షిత రూ. 500 గెలుచుకున్నారు. వీరికి డీఎంహెచ్‌వో సుదర్శనం, జిల్లా యూత్‌ కోఆర్డినేటర్‌ శైలి బెల్లాల్‌ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ ఎడ్యుకేటర్‌ వేణుగోపాల్‌, సూపర్‌వైజర్‌ మధుకర్‌, డీపీఎం సుధాకర్‌, నవీన్‌, స్రవంతి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

- ప్రజావాణికి 150 ఫిర్యాదులు
- వినతులు స్వీకరించిన కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు



కలెక్టరేట్‌కు తరలివచ్చిన పశు సంవర్ధక శాఖ ఔట్‌సోర్సింగ్‌ సిబ్బంది

సుభాష్‌నగర్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 150 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్‌ యాదిరెడ్డి, డీఆర్డీవో చందర్‌, డీపీవో జయసుధ, నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**అవకతవకలపై విచారణ చేపట్టాలి**

పశుసంవర్ధక శాఖలో గోపాలమిత్ర ఎంపికలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని బాల్కొండ నియోజకవర్గానికి చెందిన బి తరుణ్‌కుమార్‌ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గోపాలమిత్ర ఎంపిక కోసం సర్పంచ్‌ తీర్మానపత్రంతో దరఖాస్తు చేసుకున్నానని, అర్హుడినైన నన్ను తప్పించి కామారెడ్డి జిల్లా దోమకొండకు చెందిన వ్యక్తిని నియమించారన్నారు. అధికారులు తనకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు.

**వీఆర్‌ఏల పోస్టులను రద్దు చేయాలి**

పశుసంవర్ధక శాఖలో నియమించిన వీఆర్‌ఏల పోస్టులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ ఔట్‌సోర్సింగ్‌ సిబ్బంది సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ 18 ఏళ్లుగా మూగజీవాలకు పశువైద్య, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్నామన్నారు. జీవో ఎంఎస్‌ నం. 81, 85 ప్రకారం పశు సంవర్ధక శాఖలో వీఆర్‌ఏలను నియమిస్తున్నట్లు ఎక్కడా లేదని, కానీ 48 మంది వీఆర్‌ఏలకు పోస్టింగులిచ్చారన్నారు. దీంతో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న 24 మందిని తిరిగి విధులకు తీసుకోవాలన్నారు. లేకుంటే 24 కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో 24 మంది ఔట్‌సోర్సింగ్‌ సిబ్బంది పాల్గొన్నారు.

## 16 నుంచి రెండో ఏఎన్‌ఎంల సమ్మె



వైద్య, ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, దీన్ని నిరసిస్తూ 16 నుంచి రెండో ఏఎన్‌ఎంలు సమ్మెకు దిగుతున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు సమ్మె నోటీసులను ప్రజావాణిలో కలెక్టర్‌, డీఎం అండ్‌హెచ్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన వైద్యారోగ్యశాఖ కమిషనర్‌, ప్రభుత్వానికి సమ్మె నోటీస్‌ ఇచ్చినా నేటికీ స్పందన లేదన్నారు. అందుకే ఈనెల 16 నుంచి సమ్మెకు వెళ్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో యూనియన్‌ జిల్లా అధ్యక్షురాలు భాగ్యమ్మ, కార్యదర్శి సంధ్యారాణి, నాయకులు రమాదేవి, రాణి, భాగ్యలక్ష్మి, కళావతి, హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్‌ అధ్యాపకులను రెగ్యులరైజ్‌ చేయాలి



భిక్కనూరు: యునివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్‌ అధ్యాపకులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపడం తగదని కాంట్రాక్ట్‌ టీచర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా అన్నారు. సోమవారం సౌత్‌ క్యాంపస్‌లో కాంట్రాక్ట్‌ అధ్యాపకులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల మంత్రి కేటీఆర్‌కు కూడా వినతిపత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు తెలంగాణ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు డాక్టర్‌ దత్తహరి, కాంట్రాక్ట్‌ అధ్యాపకులు నాగేశ్వర్‌రావు, కిరణ్‌ రాథోడ్‌, గోపిరాజు, యాలాద్రి, సునీత తదితరులున్నారు.

## నిజామాబాద్‌-2 డిపో మేనేజర్‌గా సాయన్న



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌-2 డిపో మేనేజర్‌గా సాయన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్‌ డిపో నుంచి నిజామాబాద్‌కు ఆయన బదిలీపై వచ్చారు. నిజామాబాద్‌-2 డిపోలో ఉన్న మేనేజర్‌ వెంకటేశం బదిలీపై వరంగల్‌-1 డిపోకు వెళ్లారు. గతంలో సాయన్న డిపో మేనేజర్‌గా జిల్లాలో పనిచేశారు.

## సుభద్రకు ప్రెసిడెంట్స్‌ గోల్డ్‌ మెడల్‌ అవార్డు



బోధన్‌టౌన్‌(బోధన్‌): విశాఖపట్టణంలోని ఐఐపీఈ (ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ పెట్రోలియం అండ్‌ ఎనర్జీ) కళాశాలలో బీటెక్‌, కెమికల్‌ ఇంజినీరింగ్‌ విద్యనభ్యసించి ప్రతిభ కనబర్చిన బోధన్‌కు చెందిన విద్యార్థిని సుభద్ర జాంకార్‌కు ప్రెసిడెంట్స్‌ గోల్డ్‌ మెడల్‌ అవార్డు లభించింది. ఐఐటీ విద్యా సంస్థల్లో అకాడమిక్‌ ఎక్సలెన్స్‌కు ఇది అత్యుత్తమ పురస్కారం. ఈ పురస్కారాన్ని ఇటీవల విశాఖ పట్టణంలో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఇండియన్‌ నేషనల్‌ సైన్స్‌ అకాడమీ హానరీ శాస్త్రవేత్త అర్చన భట్టాచార్య అందజేశారు. సుభద్ర యూఎస్‌ఏలోని న్యూయార్క్‌ కార్నెల్‌ విశ్వవిద్యాలయంలో కెమికల్‌ ఇంజినీరింగ్‌లో ఆర్టిఫీషియల్‌ ఇంటలిజెన్స్‌, మెషిన్‌ లెర్నింగ్‌ విద్యను అభ్యసిస్తుంది. అత్యుత్తమ అవార్డు అందుకున్నందుకు సుభద్ర తల్లిదండ్రులు డాక్టర్‌ మకరంద్‌, అంజలి జాంకార్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి



విద్యార్థి రోజాను సత్కరిస్తున్న తెయూ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ యాదగిరి, తదితరులు

తెయూ(డిచ్‌పల్లి): బాలికలు చదువుతో పాటు క్రీడా రంగంలో ముందుండి రాష్ట్రంతో పాటు భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయంగా నిలబెట్టాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం.యాదగిరి పేర్కొన్నారు. రాష్ట్ర ఎయిడ్స్‌ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌ నెక్లెస్‌ రోడ్‌ లో జరిగిన రాష్ట్రస్థాయి యూత్‌ ఫెస్ట్‌ 5 కే రన్‌ లో బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని గుర్రపు రోజా ద్వితీయ స్థానం సాధించి, రూ.25వేలు క్యాష్‌ అవార్డు గెలుచుకోవడం హర్షనీయమన్నారు. తెయూ పరిధిలోని అనుబంధ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో రోజా చదువుతున్నారు. 5 కే రన్‌ లో ఉత్తమ ప్రతిభ చూపిన రోజా ను సోమవారం రిజిస్ట్రార్‌ యాదగిరి శాలువా, మెమొంటో తో ఘనంగా సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో తెయూ ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ కే.రవీందర్‌ రెడ్డి, గురుకుల కళాశాల అధ్యాపకురాలు ఎం.సరిత, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్‌ స్టోర్‌రూంలో షార్ట్‌ సర్క్యూట్‌



స్టోర్‌ రూంలో కాలిపోయిన ఫైళ్లు

నిజామాబాద్‌ నాగారం : నిజామాబాద్‌ మున్సిపల్‌ కార్యాలయంలోని స్టోర్‌ రూంలో షార్ట్‌సర్క్యూట్‌ జరిగింది. సోమవారం ఉదయం 11.00గంటల ప్రాంతంలో అధికారులు, ఉద్యోగులు విధులకు వస్తున్న సమయంలో షార్ట్‌ సర్క్యూట్‌ జరిగింది. పలు కీలక ఫైళ్లు కాలిపోయాయి. వెంటనే మున్సిపల్‌ ఉద్యోగులు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారమివ్వగా సకాలంలో ఫైర్‌ ఇంజిన్‌ వచ్చి మంటలర్పేశారు. అయినా రెండు గంటల పాటు పొగలు వెలువడ్డాయి. ఇందులో పలు కీలకమైన ఫైళ్లు దహనం అయ్యాయి.

**ఫైళ్ల దగ్ధంపై అనుమానాలు..**

మున్సిపల్‌ షార్ట్‌ సర్క్యూట్‌ జరగడంపై శాఖలోని ఉద్యోగులు, ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్టోర్‌ రూంలో కీలకమైన ఫైల్లు పెద్ద ఎత్తున ఉన్నాయి. ఇందులో కొన్ని ఫైళ్లు కాలిపోగా, మరికొన్ని వివరాలు తెలియనంతగా పాడయ్యాయి. అతిత్వరలోనే నూతన మున్సిపల్‌ భవనంలోకి మారే సమయంలో షార్ట్‌సర్క్యూట్‌ జరగడంపై అనుమానాలకు దారి తీస్తుంది. కొంతమంది ఉద్యోగులు మాత్రం పాత ఫైళ్లు మాత్రమే కాలిపోయాయని చెబుతున్నారు. ఏదిఏమైనా కమిషనర్‌ మంద మకరందు మాత్రం పూర్తి వివరాలు బయటకు వెల్లడించలేదు.

## మద్యం మత్తులో ఒకరి హత్య



విజయ్‌ మృతదేహం

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లి హనుమాన్‌ ఆలయం వద్ద తాగిన మైకంలో స్నేహితుల మధ్య జరిగిన వాగ్వాదం హత్యకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్‌ పట్టణంలోని మామిడిపల్లిలో నివాసముంటున్న విజయ్‌(29) మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి హనుమాన్‌ ఆలయం సమీపంలో మద్యం సేవించాడు. తాగినమైకంలో ముగ్గురి మధ్య గొడవ జరిగగా విజయ్‌ ఇంటికి వచ్చేశాడు. కొద్దిసేపటి తర్వాత ఇద్దరు మిత్రులు విజయ్‌ ఇంటికి వచ్చి కర్రలతో చితకబాది హత్యచేసి అక్కడి నుంచి పరారయ్యారు. విజయ్‌ను కొడుతున్న సమయంలో విజయ్‌ అన్నావదిన, పిల్లలు భయంతో పారిపోయారు. ఆ తర్వాత కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి విజయ్‌ను పలకరించగా మాట్లాడకపోవడంతో మృతిచెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు. మృతుడు, ఇద్దరు స్నేహితులకు నేరచరిత్ర ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.



క్రైం కార్నర్‌

# శ్రీనగర్‌లో చోరీ



వైన్‌ షాప్‌లో చోరీకి పాల్పడుతున్న అగంతకులు

వర్ని: వర్ని పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని శ్రీనగర్‌లో సోమవారం తెల్లవారుజామున ఇల్లు కిరాణా షాప్‌, వర్ని మండల కేంద్రంలోని లక్ష్మీ వైన్స్‌లో దొంగలు చొరబడి నగదు బంగారం కిరాణా వస్తువులను, మద్యం బాటిళ్లను చోరీ చేసినట్లు వర్ని ఎస్సై కృష్ణకుమార్‌ వెల్లడించారు. సుబ్బారావుకు చెందిన ఇల్లు, కిరాణా షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదు రూ.20 వేల నగదు, 4 తులాల బంగారం, వైన్స్‌లో సుమారు రూ. 50 వేల విలువగల మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లినట్లు బాధితులు వెల్లడించారు. పోలీసులు క్లూస్‌ టీం ఆధారాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

**జైతాపూర్‌లో ఆటో..**

ఎడపల్లి(బోధన్‌): ఎడపల్లి మండలంలోని జైతాపూర్‌ గ్రామంలో ఇంటివద్ద నిలిపిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితుడు శ్రీనివాస్‌గౌడ్‌ తెలిపారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ నిర్వహించడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**దేవాలయంలో..**

ఖలీల్‌వాడి: నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న రాఘవేంద్ర స్వామి దేవస్థానంలో చోరీ జరిగినట్లు ఎస్సై ప్రవీణ్‌ తెలిపారు. ఆదివారం రాత్రి మేనేజర్‌ నీలకంఠరావుతో పాటు పురోహితుడు ఆలయానికి తాళంవేసి వెళ్లి సోమవారం ఉదయం వచ్చి చూడగా మెయిన్‌ గేట్‌తో పాటు గుడితాళాలు పగలగొట్టి ఉన్నాయన్నారు. ఇందులో నుంచి 3 రాగిబిందెలు, ఒకటి ఇత్తడి బిందె తదితర సామగ్రి చోరీకి గురయ్యాయని ఆలయ మేనేజర్‌ నీలకంఠరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

**నవనాథపురం పాఠశాలలో..**

ఆర్మూర్‌టౌన్‌ : ఆర్మూర్‌ పట్టణంలోని పెద్దబజార్‌లోని రాంమందిర్‌ పాఠశాల ఆవరణలో ఉన్న నవనాథపురం స్కూల్‌లో అగంతకులు చోరీకి పాల్పడ్డారు. స్కూల్‌లో వంట గది తాళం ధ్వంసం చేసి వంటసామగ్రిని ఎత్తుకెళ్లారని హెచ్‌ఎం చంద్రశేఖర్‌ తెలిపారు.

## టోల్‌ప్లాజా బూత్‌లను ఢీకొన్న డీసీఎం



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద సోమవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో టోల్‌ప్లాజా బూత్‌లు ధ్వంసమై ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌ వైపు నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్తున్న డీసీఎంను డ్రైవరు అజాగ్రత్తగా నడిపి అతి వేగంగా వచ్చి 4, 5 టోల్‌ బూత్‌లను ఢీకొట్టాడు. దీంతో టోల్‌ప్లాజా బూత్‌లు రెండు ధ్వంసమయ్యాయి. వెంటనే డీసీఎం డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. పోలీసులు డ్రైవర్‌ను పరీక్షించగా మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## చెట్టును ఢీకొన్న కారు: నలుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ వారు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): జిల్లాలోని డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధి లో వెస్లీనగర్‌ తండా స మీపంలో 44వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్‌కు చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం నారగోని సంజీవ్‌ గౌడ్‌ తన కుటుంబ సభ్యులతో కలిసి కారు (టీఎస్‌ 18 ఈ 4152)లో హైదరాబాద్‌ నుంచి నిర్మల్‌కు వెళ్తున్నారు. వెస్లీనగర్‌ తండా వద్దకు రాగానే కారు అదుపు తప్పి రహదారి కిందకు దిగిపోయి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాలుగేళ్ల పాపతో పాటు కారులో ఉన్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు డిచ్‌పల్లి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గాయపడిన వారిలో నార గోని సంజీవ్‌గౌడ్‌, అతని భార్య సుజాత, కూతురు సంధ్యారాణి (పంచాయతీ కార్యదర్శి), మనుమరాలు వేద కృతిక ఉన్నారు. బా లిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి

ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలంలోని శివాపూర్‌ శివారులో సోమవారం రాత్రి రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని వెల్లుట్ల గ్రామానికి చెందిన వడ్ల చంద్రయ్య (45) నాగిరెడ్డిపేట మండలంలోని బొల్లారం గ్రామానికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్నారు. ఎల్లారెడ్డి నుంచి లింగంపేట మండలంలోని ఎక్కపల్లితండాకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో చంద్రయ్య సంఘటన స్థలంలో మృతి చెందగా, ఎక్కపల్లి తండాకు చెందిన ఇరువురికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన బాబు, రవిని 108లో ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వారు తెలిపారు. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో వీరిని కామారెడ్డికి రిఫర్‌ చేసినట్లు వైద్యులు తెలిపారు.